క్లుప్తంగా

విద్యుత్ కోతలు లేకుండా చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలోని గరిడీ వీధి, అమరాగార్డెన్, స్వామి రైసు మిల్లు తదితర ప్రాంతాల్లో తరచూ విద్యుత్ కోతలు లేకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ ప్రాంతాల్లో ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్ కోతలు విధిస్తుండడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఈ విషయంపై సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై విద్యుత్ శాఖ డీఈ వరప్రసాద్‌రెడ్డి పరిశీలించారు. పట్టణ ఏఈ వెంకటస్వామి సిబ్బందితో కలిసి ఆయా ప్రాంతాల్లో విద్యుత్ వైర్లకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయించారు. విద్యుత్ కోతలు లేకుండా చర్యలు తీసుకోవడంతో స్థానికులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

లక్ష్మీ నరసింహస్వామి హుండీ ఆదాయం రూ.3.28 లక్షలు

చిల్లకూరు : మండలంలోని కలవకొండలో వెలసిన ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని హుండీలోని కానుల ద్వారా రూ.3,28,013 ఆదాయం వచ్చినట్టు ఈవో రవిక్రిష్ణ తెలిపారు. స్వామి వారికి భక్తులు సమర్పించిన కానుకలను 16 నెలలుగా లెక్కించలేదు. ఈ క్రమంలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఈవో రవిక్రిష్ణ ధర్మకర్తల మండలి, దేవదాయశాఖ ఉన్నతాధికారుల అనుమతి తీసుకుని గురువారం లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. ఇందులో రూ.3,28,013లు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు, సురేంద్రరెడ్డి, ధర్మకర్త మండలి సభ్యులు సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం



అయ్యప్పస్వామిని ఊరేగిస్తున్న భక్తులు

కోట: కోటలో గురువారం ధర్మశాస్త అయ్యప్ప స్వామి భక్త బృందం ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి గ్రామోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. అయ్యప్పస్వామి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి రథంపై కొలువుదీర్చి ఊరేగించారు. కేరళ సంప్రదాయ డప్పు వాయిద్యాలు, కోలాటాలు, నృత్యాలు, మేళతాళాలు, కర్పూర హారతులతో గ్రామోత్సవం కనుల పండవగా సాగింది. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి గ్రామోత్సవంలో పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

ఉత్సాహంగా జోనల్ క్రీడా పోటీలు



వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

కోట: స్థానిక ఎస్సీ గురుకుల పాఠశాల, కళాశాల క్రీడా మైదానంలో రెండో రోజు కూడా బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ గురుకులాల జోనల్ క్రీడా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. గురువారం నిర్వహించిన హ్యాండ్ బాల్ పోటీల్లో చిల్లకూరు జట్టు విన్నర్‌గా, కోట జట్టు రన్నర్‌గా నిలిచాయి. కళాశాల విభాగంలో వాకాడు జట్టు అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ సాధించినట్లు పీడీ రాజ్‌కుమార్ తెలిపారు. పోటీలను ప్రిన్సిపాల్ ఎ.వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

బీర్ల లారీ బోల్తా



చెరువులో బోల్తా పడిన బీర్ల లారీ

తడ: మండలం అక్కంపేట గ్రామం వద్ద గురువారం బీర్ల లోడుతో వెళుతున్న లారీ చెరువులో బోల్తా పడింది. తడ పోలీసుల కథనం మేరకు.. పాండిచ్చేరిలోని మద్యం తయారీ కేంద్రం నుంచి 1,800 కేసుల బీరు లోడుతో లారీ డ్రైవర్ సేతురాంసెట్టి వైజాగ్ బయలుదేరాడు. తడ మండలం అక్కంపేట గ్రామం వద్ద గురువారం వేగంగా వెళుతున్న లారీని అదుపుచేయలేకపోయాడు. దీంతో లారీ చెరువులోకి బోల్తా పడింది. బీరు బాటిళ్లు చాలా వరకు ధ్వంసమయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న హైవే పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది అక్కడికి చేరుకుని బాటిళ్లు చోరీ కాకుండా కాపాడారు. గాయపడిన డ్రైవర్ సేతుని 108లో సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వృద్ధులకు పరికరాల పంపిణీ

చిల్లకూరు : జిందాల్ సింహపురి విద్యుత్ యూనిట్ సీఎస్‌ఆర్ కింద గురువారం తమ్మిన పట్నంలోని పంచాయతీలోని పరిశ్రమ ఆవరణలో సుమారు 50 మంది వృద్ధులకు వీల్ చైర్లు, హ్యాండ్ స్టిక్కులు, వాకర్లు, మెడకు సంబందించిన బెల్టులు పంపిణీ చేశారు. ప్లాంట్ హెడ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పరిశ్రమ ఆధ్వర్యంలో సీఎస్‌ఆర్ కింద పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. పరిశ్రమ ప్రతినిధులు ఖలీద్, ప్రవీన్, జనార్దన్, గ్రామ సర్పంచ్ నెల్లిపూడి సుబ్రమణ్యం, మత్స్యకార కాపులు శ్రీనివాసులు, భక్తాని రామయ్య, కోటయ్య పాల్గొన్నారు.

క్రీడల్లోనూ ప్రతిభ



జోనల్ క్రీడా పోటీల్లో బహుమతులు అందుకుంటున్న దక్కిలి గురుకుల విద్యార్థినులు

పిల్లలను ప్రోత్సహిస్తే ఏ రంగంలోనైనా రాణిస్తారు. ఉజ్వల భవితను అందుకుంటారు. దక్కిలిలోని గురుకుల పాఠశాలలో విశాలమైన క్రీడా ప్రాంగణం ఉండడంతోపాటు ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తుండడంతో విద్యార్థినులు విద్యతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపుతున్నారు. జోనల్ పోటీల్లో 40 మంది విద్యార్థినులు వివిధ విభాగాల్లో సత్తా చాటారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ రాణిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

- జోనల్ పోటీల్లో గురుకులం విద్యార్థినుల ప్రతిభ
- పీఈటీ ప్రోత్సాహంతోనే రాణిస్తున్నట్టు వెల్లడి
- రాష్ట్ర స్థాయిలో విజయం సాధిస్తామని ధీమా

దక్కిలి: దక్కిలి బాలికల గురుకుల పాఠశాలలో 624 మంది చదువుకుంటున్నారు. ఉపాధ్యాయులు 20 మంది పనిచేస్తున్నారు. ఇక్కడ పిల్లలకు సౌకర్యవంతంగా అన్ని వసతులు ఉన్నాయి. ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేస్తుండడంతో ఈ ఏడాది ఫలితాల్లో పదో తరగతి, ఇంటర్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రిన్సిపాల్ శ్రీదేవి సహకారంతో పీఈటీ అమరావతి పిల్లల్లోని క్రీడా నైపుణ్యాన్ని గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. దీంతో క్రీడా పోటీల్లో సత్తా చాటుతున్నారు. ఈ నెల 14, 15, 16, 17 తేదీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఉప్పలపాడు గురుకుల పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ చూపారు. ఇందులో 31 గురుకుల పాఠశాలు, కళాశాలలకు చెందిన విద్యార్థినులు పాల్గొన్నారు. దక్కిలి గురుకుల విద్యార్థినులు 40 మంది సత్తాచాటి పతకాలు సాధించారు. ముఖ్యంగా ఖోఖో జూనియర్స్ విభాగంలో విన్నర్స్‌గాను, ఖోఖో సీనియర్స్ విభాగంలో రన్నర్స్‌గాను నిలిచారు. కబడ్డీ సీనియర్ విభాగంలో రన్నర్స్‌గా నిలిచారు. షాట్ పుట్‌లో లీడ్ ప్లేస్, డిస్కస్ త్రోలో మూడో స్థానం, 200 మీటర్ల పరుగు పెందెం పోటీల్లో జూనియర్స్ విభాగంలో మూడో స్థానం, అదే ఈవెంట్ సీనియర్స్ విభాగంలో మూడో స్థానం సాధించారు. గతంలో కూడా ఈ పాఠశాల, కళాశాల విద్యార్థినులు పలు విభాగాల్లో రాణించారు.



విద్యార్థినులను అభినందిస్తున్న దక్కిలి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి

రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ రాణిస్తాం



జోనల్ స్థాయిలో గుంటూరు జిల్లా ఉప్పలపాడులో జరిగిన క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నాం. పోటీ గట్టిగా ఉన్నా రాణించాం. దక్కిలి పేరు నిలబెట్టాం. పోటీల్లో విజేతలుగా నిలిచి కప్ సాధించడం ఆనందంగా ఉంది. మమ్మల్ని ప్రోత్సహించిన ప్రిన్సిపాల్ శ్రీదేవి, ప్రత్యేక శిక్షణ ఇచ్చిన పీఈటీ అమరావతి మేడంలకు కృతజ్ఞతలు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ రాణించేందుకు సిద్ధమవుతున్నాం.

– శ్రీవల్లి, పదో తరగతి విద్యార్థిని

ప్రత్యేక శిక్షణతోనే..



జోనల్ స్థాయిలో జరిగిన క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు పీఈటీ ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. దీంతో పోటీల్లో ప్రతిభ చూపి కప్‌లు సాధించగలిగాం. దక్కిలి గురుకులం నుంచి 40 మంది విద్యార్థినులు పోటీల్లో పాల్గొన్నాం. జోనల్ స్థాయిలో 31 గురుకుల పాఠశాలు, కళాశాలల విద్యార్థినులు పాల్గొన్నారు. మాకు గట్టి పోటీ ఇచ్చారు. కప్‌లు సాధించడం వెనుక ఉపాధ్యాయుల సహకారం ఎంతో ఉంది.

– డి.పవిత్ర, జూనియర్ ఇంటర్

మరింతగా శ్రమిస్తాం..



విద్యతో పాటు క్రీడల్లో కూడా మరింతగా రాణించేందుకు శిక్షణ తీసుకుంటున్నాం. మాకు ప్రిన్సిపాల్‌తోపాటు పీఈటీ ఎంతో సహకారం అందిస్తున్నారు. విద్యపై మమకారం, క్రీడలపైనా దృష్టి సారించాలని ఎప్పుడూ చెబుతూ ఉంటారు. వారి ప్రోత్సాహంతో క్రీడల్లో మరింతగా రాణించేందుకు ప్రాక్టీసు చేస్తున్నాం. దక్కిలి గురుకుల పాఠశాల పేరు నిలబెట్టడమే మా లక్ష్యం.

– బి.సబిత, సీనియర్ ఇంటర్

క్రీడల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం



ప్రతి రోజూ క్రీడా ప్రాంగణంలో ఆయా విభాగాల్లో విద్యార్థినులకు శిక్షణ ఇస్తున్నాం. దక్కిలి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎంతో సహకారం అందిస్తున్నారు. విద్యార్థినులు కూడా కష్టపడి ప్రాక్టీస్ చేస్తున్నారు. అందువల్లే జోనల్ స్థాయిలో పలు పతకాలు సాధించారు. ఏ విద్యార్థి ఏ క్రీడా పోటీల్లో నైపుణ్యంతో గుర్తించి శిక్షణ ఇస్తున్నాం. భవిష్యత్తులో పిల్లలను జాతీయ స్థాయిలో రాణించేలా శిక్షణ ఇస్తున్నాం.

– అమరావతి, పీఈటీ, దక్కిలి గురుకుల పాఠశాల

ఎరువుల దుకాణాల తనిఖీ

సూళ్లూరుపేట రూరల్ : రైతులకు ఎరువులు, పురుగు మందులను ఎమ్మార్పీకే విక్రయించాలని గూడూరు ఏడీఏ గోపీనాయక్ ఆదేశించారు. ఆయన గురువారం సూళ్లూరుపేట వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లో ఉన్న ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువుల స్టాక్, బిల్లు బుక్‌లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసే రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు కవిత, జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడిగా రామచంద్రారెడ్డి



సర్టిఫికెట్ తీసుకుంటున్న రామచంద్రారెడ్డి

వాకాడు: ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా వాకాడు మండలం, తిరుమూరు గ్రామానికి చెందిన గండవరం రామచంద్రారెడ్డిని ఆ సంస్థ ఎంపిక చేసింది. ఈ సందర్భంగా గురువారం మండలంలోని పలువురు నాయకులు, స్నేహితులు రామచంద్రారెడ్డికి అభినందనలు తెలిపారు. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఇటీవల నాయుడుపేటలో జరిగిన సమావేశంలో హ్యూమన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ పాల్గొని తనను జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేయడం సంతోషకరమన్నారు. అవినీతి రహిత స్థాపనే ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ముఖ్య ఉద్దేశమన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

గూడూరు రూరల్ : రాష్ట్రంలో ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళీ పిలుపునిచ్చారు. ఆయన గురువారం ఆ పార్టీ నాయకులతో కలిసి గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ తదితరాలపై దృష్టి పెట్టిందన్నారు. తద్వారా సామాన్యులపై పెను భారం మోపారని దుయ్యబట్టారు. ఈ క్రమంలో ఈ నెల 26న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపడుతున్నామని, పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ ప్రభాకర్, ఎన్ శ్రీరాములు, పట్టణ కార్యదర్శి కాలేషా, చంద్రయ్య, జీ రమేష్, పార్థయ్య, మునిరత్నం నాయుడు, సీపీఎం ముత్యాలయ్య తదితరులు పాల్గొన్నారు.

10 మద్యం బాటిళ్ల స్వాధీనం



పోలీసుల అదుపులో బెల్టుషాపు నిర్వాహకుడు

వాకాడు : వాకాడు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని వాకాడు, కోట, చిట్టమూరు మండలాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న మద్యం బెల్టు షాపులపై గురువారం రాత్రి ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా కోట మండలం నెల్లూరుపల్లి, కొత్తపాళెం గ్రామానికి చెందినతోట శీనయ్యను అదుపులోకి తీసుకుని 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ ప్రసాద్ తెలిపారు. గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆలయ భూముల వేలంలో రూ.4.91 లక్షల ఆదాయం

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలోని కోదండ రామాంజనేయ స్వామి ఆలయ భూముల వేలంలో రూ.4.91 లక్షల ఆదాయం వచ్చినట్లు గూడూరు దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస బాబు తెలిపారు. ఆలయానికి నాయుడుపేటలో మూడు ఖాళీ స్థలాలకు కమర్షియల్ విధానంతో నెలవారీ అద్దె చెల్లించేలా వేలం పాటలు నిర్వహించారు. రూ.4.91 లక్షల ఆదాయం వచ్చిందని, అన్నమేడు, మర్లపల్లి, తుమ్మూరు గ్రామాల్లో ఉన్న ఆలయ మాగాణి భుములకు సైతం వేలం పాటలు పెట్టి మూడేళ్ల పాటు లీజు ఒప్పందంతో లీజుకు అప్పగించినట్లు వెల్లడించారు. ఈవో రవిక్రిష్ణ, సిబ్బంది హరిరెడ్డి, బాలాజీ, నాయకులు పాదర్తి హరినాథ్‌రెడ్డి, పెసల గంగాప్రసాద్, సుజల కృష్ణారెడ్డి, సురేష్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

సూళ్లూరుపేట : విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని లక్ష్యాల సాధనకు కృషి చేయాలని శ్రీసిటీలోని క్రియా యూనివర్సిటీ ఎకనామిక్స్ ప్రొఫెసర్ జి.సురేష్ తెలిపారు. సూళ్లూరుపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌వీ శంకరశర్మ అధ్యక్షతన కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో ప్రొఫెసర్ జి.సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నేడు పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని మంచిగా ఉపయోగించుకుంటే విద్యార్థులు తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవచ్చన్నారు. రోజుకు ఎన్ని గంటలు చదవాలనే దానిపై టైం టేబుల్ వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐఐ చిన్ని హుస్సేన్, శ్రీసిటీ ఐఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.రాజేష్, కెమిస్ట్రీ అధ్యాపకులు సీహెచ్ సుబ్రమణ్యం శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

డ్రమ్‌సీడర్‌తో వరిసాగు లాభదాయకం



డ్రమ్ సీడర్ గురించి వివరిస్తున్న అధికారులు

వెంకటగిరి రూరల్ : రైతులు డ్రమ్ సీడర్‌తో వరిపంట సాగు చేయడం సులభతరమని, లాభదాయకమని తిరుపతిలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం ఇంజినీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ సి.రమణ తెలిపారు. మండలంలోని యాచసముద్రంలో గురువారం డ్రమ్ సీడర్‌పై వరిసాగు చేపట్టడంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ డ్రమ్ సీడర్‌తో వరిసాగు చేయడం వల్ల కూలీల సమస్యను అధిగమించవచ్చన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో నారు నాటవచ్చన్నారు. వరికోత వారం ముందుగా వస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ నాగార్జునసాగర్, ఏవో సుజాత, ఏఈవో రామ్మోహన్, వీపీఏ సుమతి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

తడ: స్థానిక బీసీ హాస్టల్‌లో గురువారం పెళ్లకూరుకు చెందిన చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఇందులో 150 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు, 60 మందికి కంటి అద్దాలు అందజేశారు. 10 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ గౌరీశంకర్, సీఈవో సీతారామ్ నాయుడు, ఏవో కృష్ణ గల్లా, అరవింద నేత్రాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకుల వితరణ



నిత్యావసర సరుకులు, పండ్లు అందజేస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ఉన్న మేరీ వృద్ధాశ్రమానికి గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు నిత్యావసర సరుకులు, పండ్లు వితరణ చేశారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగాంగా ఎన్‌సీసీ విద్యార్థులు కార్యక్రమం చేపట్టినట్లు అధ్యాపకులు ఎల్ శివరెడ్డి, డాక్టర్ వాసప్ప, సుబ్రహ్మణ్యం , కిరణ్‌కుమార్ తెలిపారు. అదే విధంగా పట్టణానికి చెందిన దాతలు వృద్ధులకు దుప్పట్లు అందజేసి అన్నదానం చేశారు.

నేడు మల్లాంలో వనభోజనాలు

చిట్టమూరు (చిల్లకూరు) : చిట్టమూరు మండలం మల్లాంలో వెలసిన శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాస పూజల్లో భాగంగా శుక్రవారం వన భోజనాలు, సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించనున్నట్టు అర్చకులు తెలిపారు. ఆలయ ఆవరణలోని ఉసిరి చెట్టు కింద జరిగే వన భోజనాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొనే వారు పసుపు, కుంకుమ, కర్పూరం, అగర్ బత్తీలు, కొబ్బరికాయలు, బియ్యం, విస్తరాకులు, పండ్లు, వక్కలు, చిల్లర, పూలు, తమలపాకులు తీసుకురావాలని సూచించారు.

కండలేరులో 52.146 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 52.146 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 1,800 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,000, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 100, మొదటి బ్రాంచ్ కాలువకు 55 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

నిమ్మ, బొప్పాయి సాగుపై రైతులకు శిక్షణ

కలువాయి: మండలంలోని తోపుగుంటకు చెందిన రైతులకు గురువారం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో బొప్పాయి, నిమ్మ సాగుపై శిక్షణ ఇచ్చారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి.శ్రీనివాసులు రెడ్డి, ఉద్యాన శాస్త్రవేత్త డి.తిరుపాల్ మాట్లాడుతూ నిమ్మ, బొప్పాయి పంటలను ఆశించే చీడపీడలు, వాటి నివారణ చర్యల గురించి వివరించారు. సకాలంలో ఎరువులు, పురుగు మందులు వాడితే చీడపీడలను నియంత్రించవచ్చన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి లక్ష్మీమిథిలా, వీఏఏ శ్రీనివాసులు, వీహెచ్ఏ నరేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు



విద్యార్థులకు బహుమతులందజేస్తున్న అధికారులు

నాయుడుపేట టౌన్ : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నాయుడుపేట గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, క్విజ్ తదితర పోటీలు నిర్వహించినట్లు లైబ్రేరియన్ షేక్ అతావుల్లా తెలిపారు. ఈ క్రమంలో విజేతలకు గురువారం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు బహుమతులు అందజేశారు.

క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలి



టెబుల్ టెన్నిస్ క్రీడా పోటీని ఆరంభిస్తున్న వైస్ చాన్సలర్ భాస్కర్‌రావు

గూడూరు రూరల్ : విద్యార్థులు చదువులతో పాటు క్రీడలపైనా ఆసక్తిని పెంచుకోవాలని విక్రమ సింహపురి యూనివర్సిటీ వీసీ భాస్కర్‌రావు పిలుపునిచ్చారు. ఆయన గురువారం గూడూరు రెండో పట్టణ పరిధిలోని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్ కాలేజ్ గేట్ గేమ్స్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలో సుమారు వంద కళాశాలలు ఉన్నాయని.. వీటిలో అతి తక్కువ సంఖ్యలో కళాశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొనడం బాధాకరమన్నారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంచేలా పీడీలు చొరవ చూపాలని పేర్కొన్నారు. కళాశాలల్లో ఉన్న మౌలిక వసతులను సద్వినియోగం చేసుకుని క్రీడా పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ సునీత, కళాశాల ప్రిన్సిపల్ శివప్రసాద్, అధ్యాపకులు నారాయణరాజు, వెంకట్రాయులు, వెంకటేశ్వర్లు, శ్రీధర్‌శర్మ పాల్గొన్నారు.

భర్త కనిపించడం లేదని ఫిర్యాదు

గూడూరు రూరల్ : తన భర్త కనిపించడం లేదని గూడూరు మండలంలోని వెందోడు గ్రామానికి చెందిన యనమల వెంకటేశ్వర్లు భార్య వెంకటరమణమ్మ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం ఉదయం బహిర్భూమికి వెళుతున్నట్టు చెప్పాడని, తర్వాత తిరిగి రాలేదని పేర్కొన్నారు. రెండు రోజులుగా చుట్టుపక్కల ప్రాంతాలతోపాటు బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లేదని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన నాయకులు





వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో నరేంద్రరెడ్డి, ఎంపీ గురుమూర్తి, కామిరెడ్డి సత్యనారాయణ తదితరులు

గూడూరు రూరల్ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం తాడేపల్లిలో గూడూరు రూరల్ మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు యద్దల నరేంద్రరెడ్డి, ఎంపీ గురుమూర్తితో కలిసి మర్యాద పూర్వకంగా కలిశారు. గూడూరు నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై జగన్ ఆరా తీసినట్టు నరేంద్రరెడ్డి తెలిపారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారని వెల్లడించారు.

కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపు

పెళ్లకూరు: కూటమి ప్రభుత్వం దుర్మార్గపు పరిపాలనలో వైఎస్సార్ సీపీ కోసం కష్టపడి పని చేసేవారికి మంచి గుర్తింపు ఉంటుందని డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఆయన గురువారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. కూటమి ప్రభుత్వంలో అరాచకాలు, దౌర్జన్యాలను ఎదుర్కొని పార్టీ కార్యకర్తలను కాపాడుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు. నియోజకవర్గంలో పార్టీని అన్నీ విధాలా బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. జెడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా, నాయకులు కరణం రఘు నాయుడు, పాపాడి ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

కోటపోలూరులో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం మాక్‌డ్రిల్



కోటపోలూరు చెరువులో మాక్ డ్రిల్ చేస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారులు, సిబ్బంది

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట మండలం కోటపోలూరు గ్రామంలోని పెద్దన్నగారి చెరువులో గురువారం నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డీఆర్‌ఎఫ్) మాక్ డ్రిల్ చేపట్టారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఎలా ఎదుర్కోవాలనే విషయాన్ని చెరువులో బోట్ సాయంతో ప్రజలు, అధికారులకు అవగాహన కల్పించారు. విజయవాడ తరహాలో ప్రజలు వరద నీటిలో చిక్కుకున్నప్పుడు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ప్రస్తుతం బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్ర రూపం దాల్చి ఆంధ్రా–తమిళనాడు మీదుగా కదులుతోందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ తుపాన్ ప్రభావం ఎక్కువగా చెన్నై, ఉమ్మడి నెల్లూరు, చిత్తూరు జిల్లాల మీద ఉంటుందని, ఈ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ మాక్ డ్రిల్‌ను నిర్వహించామని తహసీల్దార్ ఎస్‌వీ నరసింహారావు, సీఐ మురళీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ బ్రహ్మనాయుడు, ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారులు సుమన్, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అడవి పంది దాడిలో గేదెలకు తీవ్రగాయాలు



అడవిపంది దాడిలో గాయపడిన గేదె

కలువాయి: అడవి పంది దాడిలో రెండు గేదెలు తీవ్రంగా గాయపడిన ఘటన గురువారం దాచూరులో వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన వంగూరు శ్రీనివాసులు, విష్ణు గేదెలను బుధవారం పొలానికి మేతకోసం తోలుకు వెళ్లారు. వారు ఇంటికి వచ్చి వెళ్లే సరికి రెండు గేదెలు తీవ్ర గాయాలతో కనిపించాయి. చిరుత దాడి చేసి ఉంటుందని భావించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. రాపూరు రేంజర్ రవీంద్రబాబు, గోనుపల్లి డీఆర్వో మస్తాన్, సిబ్బందిని ఘటనా స్థలానికి పంపి విచారణ చేయించారు. గేదెల ఫొటోలను నాగార్జునసాగర్ టైగర్ రిజర్వు ఏరియాలో పనిచేసే అంతర్జాతీయ అనిమల్ మానిటరింగ్ ఆర్గనైజేషన్ (ఎన్‌జీఓ) వారికి పంపారు. ఘటనా స్థలంలో పాదముద్రలను పరిశీలించి అవి అడవి పంది పాదముద్రలుగా నిర్ధారించారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మూగజీవాలు అడవి జంతువుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.